ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 25-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

తిలక్‌గారు భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసారు. ఆయన 2 వ అధ్యాయంలో 47వ శ్లోకమునకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు.

*కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన*

*మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి*

నీకు పని చేయటానికే అధికారం ఉంది. నీవు పని చేసినపుడు ఫలితం రావచ్చును, రాకపోవచ్చును. ఫలితము మీద నీకు అధికారము లేదు. అది ఈశ్వరుని చేతిలో ఉంది. కర్మఫలితము నీ చేతిలో లేదని పని మానకూడదు. ఫలితం వచ్చింది అనుకో ఆ ఫలితం నా వలననే వచ్చింది, దానికి నేనే కారణము అని అనుకోవద్దు. కర్మఫలమునకు కారణం కాకూడదు. కర్మఫలంమీద నీకు అధికారం లేదు కాబట్టి [redacted] నేను పని చేయనని పనిమీద విరక్తి పెట్టుకోవద్దు.

నీ దేహ ప్రారబ్ధమునుబట్టి పరమేశ్వరుడు నీకు ఏ పని అయితే ఇచ్చాడో ఆ పనిని ప్రీతితో చెయ్యి, ప్రేమతో చెయ్యి. కర్మఫలానికి హేతువు కావద్దు. ఏ పనిచేస్తే పనిలో నుండి విడుదల పొందుతావో, ఎలా పనిచేస్తే పనిలోనుండి విడుదల పొందుతావో అటువంటి పనిచెయ్యి. పనిచేస్తూ పనికి మనం దూరం అవ్వాలి. కర్మఫలాన్ని ఎవడైతే ఆశించడో వాడు కర్మ చేసినా చేయనివాడితో సమానము. పునర్జన్మ హేతువులు వాడికి పడవు. కర్మఫలం నావలననే వచ్చింది. అనుకొన్నవాడికి కర్తృత్వం పెరుగుతుంది. కర్తృత్వమే మన దుఃఖానికి కారణము. దేహమునకు పరిమితమైన బుద్ధిని కర్తృత్వం అంటారు.

ఎవడి వాసనలుబట్టి వాడు పుడుతున్నాడు. ప్రారబ్ధం పూర్తి అయిపోతేవాడి శరీరం చనిపోతుంది. తరువాత వాడి వాసనకు అనుగుణమైన శరీరం కూడా ప్రకృతి చేస్తుంది. ఇది అంతా నా సమక్షంలో ప్రకృతి చేస్తోంది. నాకు ఏమీ సంబంధము లేదు అంటున్నాడు భగవంతుడు. ఎవడి గుణాన్ని బట్టి, వాసనబట్టి వాడు నడుచుకొంటున్నాడు. పుట్టటాలు, చావటాలు ఇవి అన్నీ నాకు సంబంధం లేదు. ఇది అంతా ప్రకృతి చేసుకొనిపోతోంది, మాయ చేసుకొనిపోతోంది. నిద్రపోయే వాడికి కలలు వస్తాయి. మెలుకువలో ఉన్నవాడి దగ్గర కల యొక్క ఆటలు సాగవు. అదే విధంగా అజ్ఞానములోనుండి బయటకు వచ్చినవాడిని మాయ ఏమీ చేయలేదు.

చిల్లర చిల్లర కోరికలు, స్వల్పమైన కోరికలు భగవంతుని కోరుకొనేవాడు జనన మరణ చక్రమునుండి బయటకు రాడు. నాకు మోక్షం తప్పించి ఇంక ఏమీ వద్దు అని ఎవడైతే కోరుకొంటున్నాడో వాడు మాత్రమే ఈ జనన మరణ చక్రమునుండి బయటకు వస్తాడు. మనం మోక్షంను కోరుకోము. తాత్కాలిక అవసరాలను కోరుకొంటాము. మనకు దూరదృష్టి తక్కువ. ఈ కోరిక కోరుకొంటున్నాము పరిణామం ఎలా ఉంటుంది అని ఆలోచించుకోము. ఆలోచన పెరగాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. నీ మాటను స్వాధీనం చేసుకోవాలి. కొంతమంది అవసరము

లేకుండా మాట్లాడతారు. అవసరం లేకుండా నీ అహంభావనకోసం మాట్లాడే అలవాటు ఉంటే ఆ అలవాటులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. అదే సాధన. కొంతమంది వారిని వారు పొగడుకొంటారు. ఇతరులను విమర్శిస్తారు. ఇలా జీవిస్తూ ఉంటే ఎన్ని శాస్త్రములు చదివినా ప్రయోజనం ఏమీ ఉండదు. ఆహార విషయంలోనూ, మాటల విషయంలోనూ జాగ్రత్త లేకపోతే గీత 18 అధ్యాయాలు చదివినా ఉపయోగం లేదు, ఆధ్యాత్మికంగా వికాశం పొందలేవు.

నీవు మాట్లాడే మాట ఎదుటివారికి హితవుగా ఉండాలి, ప్రీతిగా ఉండాలి. క్షేమం కలగజేసేదిగా ఉండాలి. ఏ పని చెయ్యాలి, ఏ పని చెయ్యకూడదు అని ఆలోచించుకొని పని చెయ్యి. చేతులను అదుపులో పెట్టుకో. వాక్కును అదుపులో పెట్టుకో. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు. ఇవి అన్నీ అదుపులో పెట్టుకొంటే ఆధ్యాత్మిక అభివృద్ధికి నీకు సహకారం అందుతుంది. వీటిని అదుపులో పెట్టుకోవాలంటే నీకు ఇష్టమైన నామమును తీసుకొని మనస్సులో స్మరించుకో అని శ్రీకృష్ణ చైతన్యుడు చెప్పాడు. భగవంతుడు మన హృదయంలో ఉన్నప్పటికీ మనకు అనుభవంలోనికి రాకుండా ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు, మన మనస్సులో ఉన్న కల్మషమే అడ్డువస్తోంది. ఆ కల్మషాన్ని తొలగించేదే భగవంతుని నామము. అన్ని మార్గములు సమానమే. ఒక్కొక్క మానసిక ప్రవృత్తినిబట్టి ఒకో మార్గము ఇష్టపడతారు. ఏ మార్గములో ప్రయాణించినా మనస్సులోని కల్మషాన్ని తొలగించుకోవాలి.

నీ కోరికనుబట్టి, నీ వాసననుబట్టి నీవు పనిచేస్తున్నావు. నీవు ఇలా పనిచేస్తూ దేవుడిమీద పెడతావు ఏమిటి? నేను చెయ్యమని చెప్పిన పని చేస్తే దేవుడు చెయ్యమన్నాడు, చేసాను అనుకోవచ్చు. నీ వాసనకు అనుగుణంగా పనిచేస్తే నాకు ఏమీ సంబంధము లేదు. జననమరణ చక్రము, ఈ మాయ నిన్ను విడిచిపెట్టవు. ఇందులో తిరుగుతూ ఉండవలసిందే అంటున్నాడు భగవంతుడు. ఈ పని నావలన అయింది అని నీవు అనుకొంటున్నావు. నీ అజ్ఞానమువలన అలా అనుకొంటున్నావు. నీలో ఉన్న అజ్ఞానము, మాయ కలుగజేస్తోంది. మాయ ఎటుతిరగమంటే అటు తిరుగుతున్నారు. మీరు మాయ చేతిలో ఉన్నారు గాని నా చేతిలో లేరు. మీరు అందరూ మాయకు భక్తులు. నాకు భక్తులు కాదు అంటున్నాడు పరమేశ్వరుడు. నాకు భక్తులు అయితే నేను చెప్పిన పని మీ స్వభావమునకు ఇష్టం లేకపోయినా మీరు చెయ్యాలి. కాని నేను చెప్పినట్లు మీరు చేయటంలేదు. మీ వాసన ఎలా చెయ్యమంటే అలా చేస్తున్నారు. అందువలన మీరు మీ వాసనకు భక్తులు, మాయకు భక్తులు గాని నాకు భక్తులు కాదు. ఈ పని నావలన అయింది అంటే గొప్పవస్తుంది, గౌరవం వస్తుంది అని అనుకొంటున్నావు. మాయ నిన్ను చుట్టివేస్తోంది. అనేక నీచ జన్మలకు ఇది కారణం అవుతుంది అని నీకు తెలియటం లేదు. అందుచేత వివరణకోసం చెపుతున్నాను అంటున్నాడు భగవంతుడు.

చాలామంది మాయగురించి ఆలోచిస్తారు. మనస్సు విడిచిపెట్టి మాయలేదు. నిరంతరము నన్ను స్మరించటంవలన, నన్ను చింతించటం వలన నిన్ను మాయ విడిచిపెడుతుంది అని భగవంతుడు చెపుతున్నాడు. నిరంతరము భగవంతుని గురించి ఆలోచించగా, ఆలోచించగా మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తే మాయ నశిస్తుంది.

ఫలితం ఆశించకుండా పనిచెయ్యటం ఎలాగ అని కొంతమంది అంటారు. నీ దేహ ప్రారబ్ధములో రావలసి ఉంటే నీవు ఆశించకపోయినా అది వస్తుంది. నీ దేహ ప్రారబ్ధంలో లేదు అనుకో నీవు ఆశించినా కూడా అది రాదు. కర్మఫలానికి హేతువు కావద్దు.

నదికి వరద వచ్చినపుడు గడ్డిపరక ఎంత వేగముగా కొట్టుకొనిపోతుందో అదే విధంగా ఈ సంసార సముద్రములో కొట్టుకొనిపోతున్నావు. నిన్ను రక్షించేవాడు ఎవడూ లేడు. నీ జీవితం మలుపు తిరగాలంటే ఈ ఒక్క శ్లోకం చాలు అని తిలక్‌గారు చెప్పారు. ఇది నీ గుండెకు పట్టించుకొంటే ఒడ్డుకు వచ్చేస్తావు

అని తిలక్‌గారు చెప్పారు. ఈ శ్లోకం అర్థం అయితే నీకు శోఖం తగుతుంది. దేహము చనిపోయిన తరువాత నీవు ఏమీ బాగుపడవు. మరల కొత్త దేహము వచ్చేలోపుగా నీవు బాగుపడటానికి అవకాశము లేదు. కొత్తదేహము వచ్చాక సాధన చెయ్యాలి. ఈ లోపుగా కాలం వృధా అవుతుంది. నీవు కొంత శాంతిని పొందాలంటే, కొంత వికాశం చూడాలంటే ఈ శ్లోకం మీకు అర్ధమయితే శాంతి మీకు తెలుస్తుంది అని తిలక్‌గారు అంటున్నారు.

కొంతమంది వారికి కలిసివస్తుందంటేనే పని చేస్తారు. లేకపోతే చేయరు. ఇతరులకోసం పనిచేయరు. వారి మనస్సును సంస్కరించుకోవటంకోసం పని చేయరు. అది శ్రేయస్సు మార్గము. శ్రేయస్సు మార్గములో ఉన్నవాడికి గమ్యంమీదే దృష్టి ఉంటుంది, వాడి దృష్టి అంతా మోక్షంమీదే ఉంటుంది. ఇంక ఇతర గొడవలు ఏమీ ఉండవు. మనకు కుటుంబంలో ఏమైనా సమస్యలు వస్తే అవి పరిష్కారం చేసిపెట్టమని భగవంతుని ప్రార్ధించవచ్చు, ఆయన నెరవేర్చవచ్చును. కాని జనన, మరణ చక్రము మాత్రము నిన్ను విడిచిపెట్టదు అంటున్నారు తిలక్‌గారు. ఒక్క మోక్షం తప్పించి అల్పమైన, స్వల్పమైన కోరికలకు ఈ వేళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే కోరికల జోలికి వెళ్ళవద్దు అంటున్నారు. ఈ లోకమునకు సంబంధించిన విషయములు, పరలోకంలో సుఖంగా ఉండాలని దేవుని ప్రార్ధిస్తున్నాము గాని జనన, మరణచక్రమునుండి బయటపడటానికి నీవు కృషి ఏమీ చెయ్యటంలేదు. ప్రేయస్సు మార్గంనుండి శ్రేయస్సు మార్గములోనికి రా. అజ్ఞానములోనుండి జ్ఞానంవైపునకు నీ జీవితం మలుపు తిరగాలంటే ఈ శ్లోకం నీ గుండెకు పట్టాలి అంటున్నారు తిలక్. ప్రేయస్సు రుచిగా ఉంటుంది. కొంతకాలమునకు ఆరుచి విషంగా మారుతుంది. బాహ్యమైన రుచులకు అలవాటుపడ్డారు కాబట్టి నేను చెప్పే మాటలు విషంలాగ ఉంటాయి. నేను చెప్పేమాటలు జాగ్రత్తగా విని అర్ధంచేసుకొని మీ బుర్రకు పట్టించుకొంటే అప్పుడు అమృతంలాగ ఉంటాయి. బాహ్య విషయాలవలన వచ్చే సుఖాలు అన్నీ ప్రేయస్సు. భగవంతుని స్మరించటంవలన మీకు శాంతి కలుగుతుంది. అది శ్రేయస్సుకు తీసుకొని వెళుతుంది. అమృత స్థితిని కలుగజేస్తుంది.

భగవంతుని ప్రీతికోసం పనిచెయ్యాలి. లోకంకోసం కాదు, భోగంకోసం కాదు. భగవంతుడు చెయ్యమన్నది చేయటం కర్మ. భగవంతుడు చెయ్యమని చెప్పినపనులు చెయ్యకుండా ఉండటం అకర్మ. భగవంతుడు మనకు ఏ పని అయితే అజ్ఞాపించాడో ఆ పనిలోనుండి తప్పించుకోవటం అకర్మ. భగవంతుడు నిషేదించిన పనులు చేయటం వికర్మ. భగవంతుడు చేయవద్దని చెప్పిన పనులు చేయటం వికర్మ.

కర్మను విడిచిపెట్టాలన్న ఆసక్తి నీకు వద్దు. కొంతమంది కోరిక లేకపోతే ఆపని అవ్వదేమో అనుకొంటారు. నీ కోరిక ఫలాన్ని ఇవ్వదు. నీ కోరికకు శక్తి లేదు. శక్తి ఈశ్వరుడిది. ఈశ్వరుని ఆజననుసరించి అది నెరవేరుతుంది. నీ కోరికనుబట్టి అది నెరవేరదు. ఫలం అనేది నీ చేతిలో లేదు. నీ కోరికతో సంబంధం లేకుండా రావలసి ఉంటే అది వస్తుంది. లేకపోతే నీవు ప్రయత్నం చేసినా అది రాదు. నువ్వు చేసేపని చెయ్యి. ఫలితం వస్తుంది, రాదు అనే గొడవలు నీకు ఎందుకు? నీ గొడవ నువ్వు చూసుకో. ఫలితాన్ని ఆశించవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు కాని ఫలితం రాదు అని చెప్పటంలేదు అర్ధంచేసుకోండి. పనిచేసి ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తారు అనుకోండి. ఆ ఫలితం వచ్చినపుడు నీ కొంప ముంచుతుంది అంటున్నారు. ఆశించకుండా వచ్చినది నిన్ను బంధించదు. ఆశించి తెచ్చుకొన్నది నిన్ను బంధిస్తుంది. అనేక జన్మలకు కారణం అవుతుంది. ఆశించకుండా వచ్చినది నిన్ను పునర్జన్మలోనికి తీసుకొనివెళ్ళదు సరికదా నిన్ను అజ్ఞానములోనుండి బయటకు తీసుకొనివస్తుంది. అందుచేత ఫలం జోలికి వెళ్ళవద్దు. వెళ్ళవద్దు అన్నానని రాదు అనుకోకు. ఎంత జాగ్రత్తగా చెపుతున్నాడో చూడండి. ఇంత వివరంగా ఎవరు చెపుతారు. పరమేశ్వరుడు కాబట్టి చెపుతున్నాడు. ఏదో రకంగా మన బుర్రకు పట్టించటంకోసం చెపుతున్నాడు.

శరీరానికి రోగం వచ్చింది అనుకోండి ఎవరూ ఆశ్చర్యపడనక్కరలేదు. శరీరమే ఒక రోగము. ఆ రోగమునకు ఇంకో రోగం వచ్చింది అన్నారు భగవాన్. **The body itself is a disease.**

అంతటా వ్యాపించి ఉన్నవాడు, సర్వజ్ఞుడు, వికారములు ఆకారములు లేనివాడు, అన్ని కాలములలో ఉన్నవాడు భగవంతుడు. ఆయనే ఈ లోకానికి ప్రభువు. కాని నేను ప్రభువుని అని ఆయన అనుకోవటంలేదు. అక్కడ కర్తృత్వం లేదు. ఆయనకు తెలియకుండా ఈ సృష్టిలో ఎక్కడా ఏమి జరుగదు. మీ జీవితంలో ఏదైనా సంఘటన జరిగింది అనుకోండి. ఏమిటి ఇలా చేసావు అని ఆయనను అడగవలసిన పని లేదు. మీ జీవితంలో ఆ సంఘటన జరగుతోంది అని ఆయనకు తెలుసు. ఆయనకు తెలిసినపుడు నీకు కంగారు ఎందుకు. నీ పాపాన్ని గ్రహించను, పుణ్యాన్ని గ్రహించను. నీ పాపపుణ్యములతో నాకు సంబంధములేదు అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతునికి మిత్రులు లేరు, శత్రువులు లేరు. మనిషికి మనిషికి ఉన్నది వ్యాపార సంబంధము. ఈ సహాయం చేస్తే భవిష్యత్‌లో మనకు వాడు ఏమి ఉపకారము చేస్తాడు అని ఆశించి సహాయం చేస్తే అది వ్యాపారం అవుతుంది కాని పుణ్యాం కాదు. మీ పుణ్యాం, పాపం, మంచి, చెడ్డ నాకు ఏమీ అక్కరలేదు. నీ ప్రవృత్తినిబట్టి వాసననుబట్టి మీరు పనులు చేస్తున్నారు. మీ తిప్పలు మీరు పడుతున్నారు. వాటితో నాకు సంబంధం ఏమిటి? మీరే చేసుకొని దేవుడు ఇలా చేసాడు అంటారేమిటి? అందులో నన్ను ఇరికిస్తారేమిటి? పాపం చేస్తే దుఃఖం వస్తుంది. మిమ్మల్ని పాపం చేయమని నేను చెప్పానా? నావలన మీకు దుఃఖం వచ్చింది అంటారేమిటి? అంటున్నాడు భగవంతుడు. మీరు పుణ్యాంచేసినా, పాపం చేసినా మీ వాసననుబట్టి చేస్తున్నారు. వాటితో నాకు సంబంధం లేదు. భక్తియోగము, కర్మయోగము, జ్ఞానయోగము ఏదో ఒక యోగమును అనుసరించండి. ఏదో ఒక దేవుని ఆశ్రయించండి ఈ ప్రకృతినిదాటి బయటకు రండి అని చెపుతున్నాడు. ఈ ప్రకృతిని దాటితేకదా నీకు నా స్వరూపమును ఇచ్చేది అంటున్నాడు భగవంతుడు.

నీ దుఃఖానికి కారణము లోపలే ఉంది, బయట లేదు. మా అత్తగారివలన బాధపడుతున్నాము అంటారు. నీ దేహ ప్రారబ్ధంలో బాధపడేవంతు ఉంటే అత్తగారు అక్కరలేదు ఏదో రూపములో వచ్చేస్తుంది. ఇది అరంచేసుకోకుండా బయటివారిని తిడుతున్నాము. ఇదే మాయ. దేహప్రారబ్ధంలో ఉంది కాబట్టి మనకి ఈ దుఃఖము వచ్చింది అని అనుకోవటంలేదు. మా అత్తగారు కారణం అనుకొంటున్నాము. ఇక్కడే మాయ వచ్చేసింది అంటున్నాడు భగవంతుడు. ఇలా అనుకోవటంవలన అత్తగారిమీద పగ, విరోధం వస్తాయి. పగ, విరోధం మరల జన్మలను తీసుకొని వస్తాయి. మీకు దుఃఖం వస్తూ ఉంటే దానికి వ్యక్తులు కారణం అనుకోవద్దు. ప్రారబ్ధం ప్రకారం వస్తోంది అని గ్రహించండి. మనలను చూసి ఎవరైనా అసూయపడితే వారికి దూరంగా ఉండాలి. వారితో విరోధం వద్దు, వారితో స్నేహం కూడా వద్దు. ఉదాసీనంగా ఉండండి.

మాయలో ఉన్నవారు అంతా సంసారులే. సంసారం అంటే కుటుంబంకాదు. సంసారులు లోకమును చూసి ఎందుకు మోహపడుతున్నారు అంటే వారిలో ఉన్న జ్ఞానమును అజ్ఞానము కప్పివేస్తోంది. కాబట్టి లోకమును చూసి మోహపడుతున్నారు. వారు సాధన చేసి అజ్ఞానమును తొలగించుకొంటే లోకమును చూసి మోహపడరు. నీ హృదయంలో నేను ఉన్నాను. నన్ను మీరు తెలుసుకోవటానికి నేను అడ్డువస్తున్నానా అని అడుగుతున్నాడు. నేను ఏమీ మీకు అడ్డురావటంలేదు. నీ అజ్ఞానమే అడ్డువస్తోంది. అది తొలగిపోతే ఉన్న వస్తువు ఉన్నటుగా నీకు వ్యక్తం అవుతుంది అంటున్నాడు కృష్ణుడు. ఈ గొడవలు అన్నీ మన నెత్తిమీద పెటి ఆయన తప్పుకొంటున్నాడు. కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే నేను ఎక్కడో ఉన్నాను అని అనుకోకు, పరాయివాడిని అనుకోకు, నీ బంధువులకంటే, నీ స్నేహితులకంటే అందరికంటే దగ్గరివాడిని ఎందుకంటే నీ స్వరూపంగానే ఉన్నాను. నీకు స్వరూపజ్ఞానం లేకపోవటం వలన లోకం

మీద మోహం కలుగుతోంది. శాంతి ఆనందము నీలోపలే ఉన్నాయి. నశించని వస్తువు ఒకటి నీలోపలే ఉంది. నీ శరీరం ఉండగానే ఆ వస్తువు తాలుక సుఖాన్ని, శాంతిని నీవు పొందవచ్చు. నీ అజ్ఞానమే దీనికి అడ్డు వస్తోంది. దానిని తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. దానిని నీ అంతట నీవు తొలగించుకోలేవు. నిరంతరము నన్ను పూజించు, నన్ను జపించు, నాకు ఇష్టమైన పనులు చెయ్యి, నాకోసం జీవించు అలా చేస్తూ ఉంటే నా అనుగ్రహంవలన అజ్ఞానం ఊడిపోతుంది అంటున్నాడు భగవంతుడు. నిరంతరము ఆయన గొడవలో ఉంటే మాయ ఊడిపోతుంది అంటున్నాడు. మనం బొత్తిగా భక్తిలేని వాళ్ళము కాదు. మనది ఈగల భక్తి అన్నారు రామకృష్ణుడు. ఈగలు ఏమి చేస్తాయి అంటే ఒక నిమిషం మిఠాయిమీద వాలుతుంది. తరువాత మలంమీద వాలుతుంది. అలాగే మనంకూడా కొంతకాలం దేవుని గొడవలో ఉంటాము. కొంతకాలం ప్రకృతి గొడవలలో ఉంటాము. అందువలన మనది ఈగల భక్తి. నీ భక్తి ఈశ్వరాభిముఖంగా ఉండాలి. నిరంతరము భగవంతుని ధ్యాసలో ఉండాలి. మీకు భగవంతునిమీద ప్రేమ కుదిరితే, మధురభక్తి కుదిరితే, ప్రీతి కుదిరితే ఆయనలో నిన్ను ఐక్యం చేసుకొంటాడు.

ఎప్పుడైనా దుఃఖం వస్తుంది అనుకోండి. కొంతసేపు ధ్యానం చేసుకొంటే, దేవుని స్మరించుకొంటే దుఃఖము తగ్గుతుంది. అంతమాత్రంచేత లోపల అజ్ఞానం పోదు. మేము గురువు దగ్గరకు వెళ్ళాము, ఆయన బూడిద ఇచ్చారు అంటారు. బూడిద తీసిఇస్తే అజ్ఞానం పోతే ఈ గొడవ అంతా ఎందుకు? ఇలా చిట్కాలువలన పోదు. అజ్ఞానం బయట లేదు. నీలోపల ఉంది. నీ మాటద్వారా, చేతద్వారా దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ నీకు నీవు సహకరించుకొంటే భగవంతుని సహాయం అందుతుంది. అప్పుడు అజ్ఞానంనుండి బయటపడగలవు.

ఎవడివాసనకు తగిన శరీరం వాడికి ఇవ్వటం ఇది అంతా మాయ చేస్తుంది. కర్మఫలం వాడు అనుభవించాలికదా. వీటితో నాకు సంబంధం లేదు. నా మీద నిష్ఠూరం వెయ్యవద్దంటున్నాడు భగవంతుడు. డాక్టరు డాక్టరుపనిని చేస్తాడు, ఇంజనీర్ ఇంజనీర్‌పనిని చేస్తాడు, వడ్రంగివాడు వడ్రంగిపనిని చేస్తాడు. ఈ పనులతో నాకు సంబంధం లేదు. ఆ పనులు చేయమని నేను ఏమీ చెప్పలేదు. వాడి వాసననుబట్టి మాయవాడికి ఆ పనులు అప్పజెప్పింది. వీటితో నాకు ఏమీ సంబంధము లేదు అంటున్నాడు. నీ కర్మతోటి, నీ కర్తృత్వంతోటి, నీ పాప పుణ్యములతోటి, నీ చావుపుట్టుకలతోటి, నీ రంగుతోటి నాకు సంబంధం లేదు. ఇది అంతా మాయ చేసే పని నాకేమీ సంబంధం లేదు. I am above all these things. వారి వాసననుబట్టి ఇష్టమైన వృత్తిలోనికి వెళుతున్నారు దానినిబట్టి కర్మ చేస్తున్నారు. నాకు సంబంధంలేదు. ఇలా ఏమీ సంబంధం లేదు అని చెప్పే భగవంతుడు మనలను విడిచిపెట్టిలేడు. మన స్వరూపంగానే ఉన్నాడు.

ఎవడి కర్మను వాడే కల్పించుకొంటున్నాడు. నేను ఏమీ కల్పించుకోమని చెప్పటంలేదు. వీటితో భగవంతునికి సంబంధము లేదు అంటున్నాడు. కృష్ణుడు భగవంతుడే. అయినప్పటికీ ఇక్కడ నాకు సంబంధం లేదు అని చెప్పటంలేదు. భగవంతునికి సంబంధం లేదు అంటున్నాడు. మరల మనలను ఇక్కడ మాయలో పెడుతున్నాడు. కృష్ణుడు దేవుడు కాదు, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటాము. కృష్ణుడు వేరు, దేవుడు వేరు అనుకొంటాము. మాట మాటకు మాయలో పెట్టేస్తున్నాడు. మనం ఆ మాయకు దొరికేస్తున్నాము. అందులో పడిపోతున్నాము. ఇందులోనుండి బయటకు రావాలి అనే సంకల్పము నీకు ఉంటే రుచిలోనుండి అమృతంలోనికి రావాలి, చనిపోయే స్థితిలోనుండి చావులేని స్థితికి రావాలి. అది నీ హృదయంలోనే ఉంది.

నీ జనన మరణ ప్రవాహమును నేను తిప్పటంలేదు. నీ వాసననుబట్టి మాయ తిప్పుతోంది, అజ్ఞానం తిప్పుతోంది నేను తిప్పటం లేదు.

కర్మఫలాన్ని ఆశిస్తూ పనిచేస్తూ ఉంటే చావటం, పుట్టటంతప్ప ఇంకో పని లేదు. కర్మఫలాన్ని ఆశించటం

మానివేసారా మీకు ఈశ్వరుడు దొరుకుతాడు అంటున్నారు తిలక్‌గారు. మీ స్వరూపం మీకు దొరుకుతుంది. కర్మఫలమును ఆశించి, వచ్చిన ఫలమును భోగించి ఆ గొడవలు మీకు ఇష్టమైతే ఆ గొడవలలోనికి వెళ్లండి. కర్మఫలాన్ని ఆశించటం మానివేస్తే అప్పుడుకూడా దేవునికి సంబంధం లేదు కాని ఏమవుతుంది అంటే మేఘం తప్పుకొంటే సూర్యుడు మనకు ఎలా కనబడతాడో కర్మఫలం ఆశించటం మానివేస్తే మాయ ప్రక్కకు తప్పుకొని లోపల ఉన్నదేవుడు మీకు కనిపిస్తాడు. కర్మఫలాన్ని ఆశించకుండా ఉంటే మనకు రెండు లాభములు (1) ఫలం మనచేతిలోనికి వస్తుంది. (2) మాయ తప్పుకొంటుంది. అప్పుడు దేవుడు తెలియబడతాడు.

మీరు వచ్చి శ్రద్ధగా వినండి అని వివేకానంద ఒకోసారి చెప్పేవారట. అలా చెప్పినపుడు వారు మాకు ఎలా కుదురుతుంది. మేమంతా గృహస్థులము. మాకు ఎక్కడ సాగుతుంది అనేవారట. అప్పుడు వివేకానంద గృహస్థులము, గృహస్థులము అంటున్నారు గృహాన్ని మీరు పట్టుకొన్నారా? ఎక్కడికి వెళ్ళవద్దని గృహము మిమ్మలను పట్టుకొందా అనేవారట. గృహం ఏమీ నీకు చెప్పటం లేదు. నీవే అలా అనుకొంటున్నావు.

తిలక్‌గారు చెప్పే విషయంలో ప్రాముఖ్యత ఎక్కడ ఉంది అంటే మనిషికి దుఃఖము వస్తోంది. ఎంత డబ్బు ఉన్నా దుఃఖము వస్తోంది. దానికి కారణం కర్తృత్వం. ఆ కర్తృత్వమును నేను కల్పించటంలేదు. మీలో ఉన్న వాసననుబట్టి మాయ కల్పిస్తోంది. కర్తృత్వమునకు నాకు ఎట్టి సంబంధంలేదు. మాయ నశిస్తే కర్తృత్వం నశిస్తుంది. కర్తృత్వము నశిస్తే దుఃఖము నశిస్తుంది. అంటే ముందుగా మాయ నశించాలి. మాయ ఎలా నశిస్తుంది అంటే నన్ను ఆశ్రయిస్తే, నా రూపమును ధ్యానిస్తూ ఉంటే, నా నామమును స్మరిస్తూ ఉంటే, నిరంతరము నన్ను తలపెట్టుకొంటూ ఉంటే మాయ నశిస్తుంది. నా గురించి మాట్లాడుకోండి, నా గురించి ఆలోచించండి, నా పని చేయండి, ఏ గొడవ లేకుండా ఉండలేరు కాబట్టి నా గొడవ పెట్టుకోండి. ఇది అంతా ఎందుకు చెపుతున్నాడు అంటే ఆయన గొడవలో మనం ఉంటే మాయ నశిస్తుంది. మాయ నశిస్తే కర్తృత్వం నశిస్తుంది. కర్తృత్వం నశిస్తే దుఃఖము నశిస్తుంది. అప్పుడు ఇంక మీకు జన్మరాదు. నిరంతరము ఏ క్షణానికి ఆ క్షణం వైకుంఠములో ఉన్నట్లు ఉంటుంది.

ఏ సుఖం తెలిసిన తరువాత దానికి మించిన సుఖం లేదు అని తెలుస్తుందో, ఏ శాంతిని పొందిన తరువాత దానికి మించిన శాంతి లేదని మీకు తెలుస్తుందో, ఏ ఆనందమును పొందిన తరువాత దానికి మించిన ఆనందము లేదని మనకు తెలుస్తుందో అట్టి సుఖంలోనికి, అట్టి శాంతిలోనికి, అట్టి ఆనందములోనికి మేలుకోండి అని కృష్ణుడు చెపుతున్నాడు.

ఈమధ్య బాగా చదువుకొన్న వ్యక్తి ఒకరు వచ్చి నేను దానిగురించి తెలుసుకొందాము అనుకొంటున్నాను, అది తెలుసుకోవాలి అనుకొంటున్నాను, ఇది తెలుసుకోవాలనుకొంటున్నాను అని చెపుతున్నారు. ఏది తెలుసుకొందాము అని అనుకొన్నా అక్కడ నేను ఉంది. అన్ని విషయాలలోనూ నేను ఉంది. ఈ నేనుయొక్క స్వరూపం తెలుసుకోకుండా, ఈ నేనుయొక్క మూలం తెలుసుకోకుండా ఈ నేను ఆధారంగా చేసుకొని ఎన్ని విద్యలు నేర్చుకున్నప్పటికీ, ఎన్ని శాస్త్రములు చదివినప్పటికీ నీకు పాండిత్యము రావచ్చును గాని మూర్ఖత్వంపోదు. ఇటువంటివారిని చదువుకొన్న మూర్ఖులు అన్నారు భగవాన్.

* * *